క్లుప్తంగా

దళితుల సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్: ఏజెన్సీలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘాల నాయకులు దుర్గే మహేందర్, దళిత రత్నా అవార్డు గ్రహీత నర్సింగ్ మోరేలు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో సమానంగా 70 ఏళ్లుగా దళితులు నివాసం ఉంటున్నారని, వారు సాగు చేసే భూములకు హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. భూములు ఉన్నా.. బ్యాంకు ద్వారా పంట రుణాలు పొంద లేని పరిస్థితి ఉందని వాపోయారు. దళితుల సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సదాశివ్ పాల్గొన్నారు.

బంబారలో వైద్య శిబిరం

వాంకిడి: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బంబార, సోనాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్నందున జాగ్రత్తలు పాటించాలని, మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, టీజీబీ బ్యాంకు మేనేజర్ విష్ణు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

కాగజ్‌నగర్‌టౌన్: అయ్యప్ప ఆలయంలోని అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని శుక్రవారం శోభయమానంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పల్లకి సేవ నిర్వహించి ఆటపాటలతో శోభాయాత్ర చేపట్టారు. కాగజ్‌నగర్ పుర వీధులగుండా సాగిన అనంతరం కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగులో చక్రస్నానం ఆచరించారు. భక్తి పారవశ్యంతో స్వాములు శరణమయ్యప్ప అని అయ్యప్పకు సహా పంచామృతాభిషేకం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గణేశ్ నాయర్, గురుస్వాములు భిక్షపతి, నాగేందర్, శంకరయ్య, రవీందర్, స్వాములు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కౌటాల(సిర్పూర్): పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. కౌటాల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. నిష్పక్షపాతంగా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతకు ముందు రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ సాదిక్ పాషా, ఎస్సై మధుకర్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

వాంకిడి: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన చునార్‌కార్ శ్రీకాంత్ అనే యువకుడు గత ఆరు నెలల క్రితం ఫోన్ పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు.

8 కాళ్లతో మేక పిల్ల



రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సునార్కర్ గంగారాంకు చెందిన మేకకు శుక్రవారం 8 కాళ్లు ఉన్న మేక పిల్ల జీవం లేకుండా పుట్టింది. జన్యుపరమైన లోపం కారణంగా మేక పిల్లకు 8 కాళ్లు ఉన్నాయని పశువైద్యాధికారి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా రామానుజన్ జయంతి


కౌటాల: రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: మండలంలోని ఇందాని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రయ్య మాట్లాడుతూ గణిత శాస్త్ర విలువలను తయారు చేసిన గొప్ప ప్రపంచ మేధావి రామానుజన్ అని అన్నారు. ఇందాని పాఠశాలలో విద్యార్థులతో గణిత మేళా నిర్వహించారు. హెచ్ఎం శివచరణ్, అధ్యాపక సిబ్బంది సురేందర్ కుమార్, సంతోష్, రాజమౌళి, మహేష్, శ్రీనివాస్, శివకుమార్, సందీప్, పాల్గొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని హెచ్ఎం నారాయణ్ సింగ్ అన్నారు. శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులు సంతోష్, రాంచందర్‌లను శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు రమేష్, రాంచందర్, శ్యాంరావు, సత్యనారాయణ, ప్రియ, ప్రత్యూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గణిత నమూన ప్రదర్శనలు, గణిత, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ శంకర్, జిల్లా అధ్యక్షుడు ఉబేద్ బిన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కాగజ్‌నగర్‌టౌన్: మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కాగజ్‌నగర్‌లో గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు.

జైనూర్: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి, గణిత దినోత్సవాన్ని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు గణితానికి సంబంధించి వివిధ ఆకృతుల్లో ప్రదర్శనలిచ్చారు. ముందుగా గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణితశాస్త్ర ఉపాధ్యాయులు కొడప మారుతికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సోనేరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పేదరికం చదువుకోవడానికి అడ్డుకాదని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ అన్నారు. శుక్రవారం వంజీరి, రాస్పెల్లి గ్రామాల పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు.

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లేతన్‌గూడ, పులికుంట కాలనీ పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


జైనూర్: పాఠశాలలో వివిధ ఆకృతుల్లో కూర్చున్న విద్యార్థులు


వాంకిడి: కళాశాలలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


దహెగాంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు, గిరవెల్లిలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో క్రిస్మస్ వేడుక సందర్భంగా విద్యార్థినులు నృత్యాలు చేశారు. పాఠశాల ఆవరణలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గిరవెల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కానాన్ చర్చి ఆధ్వర్యంలో గిఫ్టులు అందజేశారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాతిమా కాన్వెంట్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆదిలాబాద్ డయోసీజ్ బిషప్ మార్ ప్రిన్స్ ఆంథోని, రెవ్.ఎఫ్ఆర్ జోబి సీఎంఎఫ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాఫల్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని నజరేత్ మిషన్ స్కూల్, ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అందరిని ఆకట్టుకున్నాయి. నజరేత్ మిషన్ స్కూల్ ఫౌండర్ బ్రదర్ ప్రకాశ్, ప్రిన్సిపాల్ స్టీవెన్, ఫాదర్ టామో, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


వినోద్ (ఫైల్)

రెబ్బెన: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పైకాజీగూడకు చెందిన సునార్కర్ వినోద్ (22), మిత్రుడు సాయికిరణ్‌తో కలిసి గురువారం రాత్రి బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా, మండల కేంద్రంలో గంగాపూర్ గ్రామానికి చెందిన అరికిల్ల తిరుమలేష్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ ఎదురుగా వచ్చి వినోద్ బైక్‌ను ఢీకొట్టాడు. వినోద్ తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంలో సాయి కిరణ్, తిరుమలేష్‌లకు సైతం గాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం'


ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావుతోపాటు ఇతర సంఘాల నాయకులు విశ్వప్రసాద్‌రావు సమక్షంలో శుక్రవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ సింగరేణి మనుగడ ఉండాలంటే సింగరేణిలో ఐఎన్‌టీయూసీని గెలిపించాలన్నారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం రవీందర్, సురేందర్ రాజు, తిరుపతి, పల్లాస్, సూరం రవీందర్‌లతో తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన భీమన్న స్టేడియం

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ భీమన్న స్టేడియం ముస్తాబైంది. శనివారం జరగనున్న వేడుకల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకల్లో భాగంగా ముందుగా జీఎం కార్యాలయంలో పతాకావిష్కరణ అనంతరం భీమన్న స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఏరియా జీఎం రవిప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు ప్రారంభించనున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతుల ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భీమన్న స్టేడియంలో ఏర్పాటు చేసిన సింగరేణి తల్లి విగ్రహం, వాటర్ ఫౌంటేన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఎదురుఎదురుగా ఢీ కొ న్నాయి. ఆసిఫాబాద్‌కు చెందిన హర్ష హుస్సేన్ పెట్రోల్ కోసం బంకుకు వెళ్తున్న సమయంలో బంకు నుంచి బయటకు వస్తున్న మ రో బైక్ ఎదురుగా ఢీ కొట్టింది. ప్రమాదంలో వాంకిడికి చెందిన లోకేష్ చెవికి, కార్తీక్ తలకు గాయాలయ్యాయి. హర్షహుస్సేన్ కాలు, చేయికి తీవ్ర గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు

దహెగాం: మండల కేంద్రంతో పాటు లగ్గాం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలాల్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం 17కు మించకుండా ఉండే విధంగా చూడాలన్నారు. నాణ్యమైన ధాన్యం తీసుకురావడం వల్ల మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, రైతులు ఉన్నారు.

'పాఠశాలల పని వేళలు మార్చాలి'

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో రోజురోజుకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్న దృష్ట్యా పాఠశాలల పని వేళలు మార్చాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, ఆడే ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలిగాలులు వీస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాల నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని నవగాం బస్తీలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం సాయంత్రం కేంద్ర (ఎన్‌క్యూఏఎస్) బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఎన్‌క్యూఏఎస్ ఎక్స్‌టర్నల్ అస్సెసర్ పర్సన్ డాక్టర్ రతి బాల చంద్రన్ రికార్డులు పరిశీలించారు. డెంగీ, మలేరియా, టీబీ, కుష్టు తదితర వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు, ఆయా రోగులకు అందిస్తున్న చికిత్సలు, కేసుల వివరాలు, ఐఆర్ఎస్ పిచికారీ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సీతారామ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి అనీసుద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా


బోల్తా పడిన కారు

ఆసిఫాబాద్‌రూరల్: అదుపు తప్పి కారు బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం గోలేటికి చెందిన జిల్లెల స్వామి ఆసిఫాబాద్‌కు పనిపై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బూర్గుడ సమీపంలో అదుపు తప్పి కారు బోల్తా పడింది. ప్రమాదంలో జిల్లెల స్వామికి స్వల్ప గాయాలయ్యాయి.

ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ


స్వీట్లు పంచిపెడుతున్న మంగి గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

తిర్యాణి: జిల్లా కేంద్రం నుంచి మండలంలోని మంగి గ్రామం వరకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు వివిధ కారణాలతో గత ఆరు నెలల క్రితం నిలిపివేశారు. దీంతో సాక్షిలో ఈనెల 20న 'బస్సు పునరుద్ధరణ ఎప్పుడో..?' శీర్షికన కథనం ప్రచురితమవడంతోపాటు ఆదివాసీ సంఘాల నాయకులు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు అందజేసిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు స్పందించారు. శుక్రవారం నుంచి బస్సు సర్వీసును పునరుద్ధరించారు. చాలా రోజుల తరువాత మళ్లీ మంగి గ్రామానికి బస్సు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బస్సుకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించడంతో పాటు స్వీట్లు పంచిపెట్టారు.

భక్తిశ్రద్ధలతో సాయి మండల పూజ


పూజలు చేస్తున్న సాయి భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: సాయిబాబా దీక్షాపరులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ శ్రీ కోదండ రామాలయంలో శ్రీసాయి మండల పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సాయినాథుని విగ్రహానికి పంచామృత స్నానం, శివుడికి, శ్రీరాములవారికి అభిషేకం చేపట్టారు. అనంతరం పుష్పాభిషేకం, హోమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాయి విగ్రహంతో పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించారు. దీంతో పట్టణం సాయి నామంతో మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు సిరిపురం భద్రయ్య, తిరుపతి, సునీల్, దీక్షా స్వాములు సురేశ్, దయాసాగర్, మహేష్, కల్యాణ్, అనిల్, అన్వేష్, రవి, భక్తులు శేఖర్, చందు, సుదర్శన్, శ్రీకాంత్, శంకరయ్య, సత్యం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ఆసిఫాబాద్‌రూరల్: హోమంలో పాల్గొన్న భక్తులు

చింతలమానెపల్లి: సన్మార్గంలో నడవడానికి ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శ్రీ జగదీశ్వర ఆనందగిరి స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖర్జెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలో పతాకావిష్కరణ, గీతా పారాయణం, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన గురువులు శ్రీ జగదీశ్వర ఆనందగిరి స్వామి, విష్ణు దేవానందగిరి స్వామిలకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ పంచముఖ ఆంజనేయ ఆలయంలో గీత జయంతి సందర్భంగా శుక్రవారం ఆలయంలో హోమ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, గీత పారాయణ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వాములు రంగయ్య స్వామి, నారాయణ స్వామి భక్తి ప్రవచనాలు బోధించారు.

'ఏఐటీయూసీది అలుపెరుగని పోరాటం'


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

రెబ్బెన: కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీది అలుపెరుగని పోరాటాలు చేస్తోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే.రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దీపావళి బోనస్, లాభాల వాటా, రిటైర్డ్ కార్మికులకు పెన్షన్, కార్మికులకు బోనస్ వంటి అనేక హక్కులు సాధించిన ఘనత ఏఐటీయూసీదన్నారు. పైరవీల పెత్తందార్లకు కొమ్ముకాసే ప్రభుత్వ సంఘాలకు కార్మికులంతా ఈసారి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఎర్రజెండా నీడలో కార్మికుల హక్కులకు రక్షణ, సింగరేణి పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. ఆర్థిక దోపిడీకి గురైన సింగరేణిని కాపాడుకోవాలంటే కార్మికులంతా నక్షత్రం గుర్తుకు ఓటు వేసి ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షుడు రహెమాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేష్, కిరణ్, చంద్రశేఖర్, శివరాం, దివాకర్, ఆనంద్, రాజయ్య, రఘునాథ్‌రెడ్డి, అశోక్, రామయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలి'


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

రెబ్బెన: ఈనెల 27న జరుగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో 19శాతం ఎంజీపీ, అలవెన్సులల్లో 25శాతం పెరుగుదల సాధించటంలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. మిగిలిన రాష్ట్రాల్లోని బొగ్గు గనులను కంపెనీ సాధించడానికి, కార్మికులకు సొంతింటి పథకాన్ని సాధించడానికి, ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రుణాల సాధన వంటి హక్కుల కోసం కార్మికులంతా బీఎంఎస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు పులి రాజిరెడ్డి, గోలేటి బ్రాంచి కార్యదర్శి మారెపల్లి అంబేద్కర్, ఫిట్ కార్యదర్శి మల్లికార్జున్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, ప్రభారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైకుంఠ ద్వార దర్శనం

ఆసిఫాబాద్‌అర్బన్: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని నేడు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారాన్ని పూలతో ముస్తాబు చేసి సుందరంగా అలంకరించారు.